# కొల్లాపూర్‌లో కోలాహలం

- ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- మండుటెండల్లో కదలని జనం
- గులాబీమయంగా సభా ప్రాంగణం
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం





మిద్దెపై ఎక్కి సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వింటున్న విద్యార్థులు



సీఎం కేసీఆర్‌కు జై కొడుతున్న ప్రజలు



సీఎం సభలో స్థలం లేకపోడంతో ప్రహరీపై ఎక్కి వింటున్న జనం

కొల్లాపూర్, నవంబర్ 19: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభ కోలాహలంగా మారింది. పట్టణంలోని అయ్యప్ప ఆలయ సమీపంలో ఏడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఆశీర్వాద సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో సభ పూర్తిగా నిండిపోయింది. తమ అభిమాన నేత, సీఎం కేసీఆర్‌ను చూడటానికి, ప్రసంగం వినడానికి దండుగా కదలివచ్చారు. తండాలు, చెంచు గూడేల జనం సైతం గులాబీ జెండాలను చేతపట్టుకొని తరలివచ్చారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి, పెంట్లవెల్లి, కోడేరు, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల్లో నుంచి వాహనాల్లో భారీగా తరలివచ్చారు. జనం తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పోలీసులు వాహనాలను పట్టణ శివారులోనే నిలిపి వేయడంతో మండుటెండల్లో లెక్క చేయకుండా సుమారు కిలో మీటరు దూరంలో ఉన్న సభాస్థలికి నడుచుకుంటూ తమ అభిమాన నేతను చూడటానికి తరలివచ్చారు. సభ ఓపెన్‌గా ఉండడంతో మధ్యాహ్నం మండుటెండను లెక్క చేయకుండా సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. జనం మధ్యాహ్నం 2:30గంటల వరకు తరలివస్తూనే ఉన్నారు. సీఎం కేసీఆర్ ప్రసంగం 3:03గంటలకు ప్రారంభించి 3:35గంటల వరకు సుదీర్ఘంగా కొనసాగింది. సభా ప్రాంగణంలో సీఎం కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు, కటౌట్లు, తోరణాలు రెపరెపలాడుతూ గులాబీమయంగా మారింది. కొల్లాపూర్ సభ బీఆర్ఎస్‌శ్రేణుల్లో ఫుల్ జోష్‌ను నింపింది. ఈ సభ రాజకీయ ప్రత్యర్థి అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. గాయని మధుప్రియ, గాయకుడు ప్రసాద్ కళాకారుల బృందాల ఆటపాటలు జనంలో మరింత జోష్‌ను నింపినట్లయింది. గులాబీల జెండాలే రామక్క.. పాట మధుప్రియ పాడిన పాటకు వేదికపై నాయకులతోపాటు సభా ప్రాంగణంలో యువతీ, యువకులు గంతులేశారు. సభా ఆద్యంతం బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

## ఎస్ఎన్ఆర్‌పై అభిమానంతో..

వనపర్తి, నవంబర్ 19: వనపర్తి పట్టణంలోని రాంనగర్‌కు చెందిన బీఆర్ఎస్ యువకుడు ప్రవీణ్‌సాగర్ మంత్రి నిరంజన్‌రెడ్డిపై అభిమానం చాటుకున్నాడు. తన నాయకుడు ఎన్నికల్లో గెలుపొందాలన్న ఆలోచనతో తన జుట్టులో ఎస్ఎన్ఆర్ అక్షరాలతో కటింగ్ చేసుకొన్నాడు.



తన జుట్టులో ఎస్ఎన్ఆర్ అక్షరాలతో ప్రవీణ్‌సాగర్



ఎల్ ఈడీ స్క్రీన్‌పై అభివృద్ధి గురించి వివరిస్తున్న దృశ్యం



సీఎం కేసీఆర్ సభకు ర్యాలీగా వస్తున్న జనం

# కురుమూర్తి జాతరకు ప్రత్యేక బస్సులు



వనపర్తి నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు



క్యూలైన్‌లో నిలిచి ఉన్న భక్తులు

వనపర్తి టౌన్, నవంబర్ 19: తెలంగాణ తిరుపతి కురుమూర్తి జాతరను పురస్కరించుకొని వనపర్తి జిల్లాకేంద్రంలో ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడిపింది. రిజినల్ పరిధిలో ప్రతి 5నిమిషాలకు ఒక ప్రత్యేక బస్సును నడుపుతున్నారు. అందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని 9 డిపోల్లో 175 బస్సులను నడుపుతున్నది. అదులో భాగంగా మహబూబ్‌నగర్ 60, నాగర్‌కర్నూల్ 38, వనపర్తి 30, గద్వాల 12, నారాయణపేట 10, కొల్లాపూర్ 10, అచ్చంపేట 10, కల్వకుర్తి 10, షాద్‌నగర్ 5 బస్సుల చొప్పున బస్సులను నడుపుతున్నారు. ఆదివారం వనపర్తి డిపోలో ఆర్టీసీ సహాయ మేనేజర్ దేవేందర్ ఆధ్వర్యంలో కురుమూర్తి బస్సులకు ప్రత్యేక టెంట్ వేసి బస్సులు నడిపారు. గతేడాది మాదిరి గానే ఒక్కొక్కరికీ రూ.80చొప్పున పాత చార్జీలతో ఉద్దాలకు పంపించారు.

**పోటెత్తిన భక్తులు**

ఆదివారం కురుమూర్తి ఉద్దాలను పురస్కరించుకొని పెద్ద ఎత్తున కొల్లాపూర్, వనపర్తి ప్రాంతాల నుంచి భక్తులకు బస్టాండ్‌కు పోటెత్తి వచ్చారు. కురుమూర్తి ఉద్దాలకు వెళ్లేందుకు వచ్చిన భక్తులకు ఆర్టీసీ సిబ్బంది ప్రత్యేక బస్సులలో తరలించారు.

# అలంపూర్ అట్టహాసం

- కాంగ్రెస్ పార్టీ కంటే బీఆర్ఎస్‌కు రెట్టింపు జనం హాజరు

అలంపూర్, నవంబర్ 19: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద బహిరంగ సభకు నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ మొత్తంలో హాజరయ్యారు. సుమారు 40వేలకు పైగా హాజరై ఉంటారని అంచనా. ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు, ఎమ్మెల్సీ చల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా సీఎం కేసీఆర్ హాజరై మాట్లాడారు. పదిరోజుల కిందట శాంతినగర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రజాగర్జన సభకు 20నుంచి 25వేల మంది హాజరయ్యారు. కాగా.. దానికి రెట్టింపు స్థాయిలో బీఆర్ఎస్ సభకు ప్రజలు హాజరు కావడం గమనార్హం. దీంతో బీఆర్ఎస్‌పై ప్రజలకు ఏ మాత్రం అభిమానం ఉందో అర్థం చేసుకోవచ్చు. సభా ప్రాంగణంలో నిర్వాహకులు సుమారు 30వేల కుర్చీలు వేయగా వచ్చిన ప్రజలకు కుర్చీలు సరిపడక సభా ప్రాంగణం చుట్టూ నిలబడి కేసీఆర్ ప్రసంగం విన్నారు. బీఆర్ఎస్ ఊహించినదానికంటే ప్రజల్లో రెట్టింపు అభిమానం ఉన్నదని సభకు వచ్చిన వేలాది మంది అభిమానులను చూసి చెప్పవచ్చు. ఈ ప్రజాస ముద్రం కారు గుర్తుకు ఓటు వేస్తే విజయుడు విజయం తథ్యమని పరిశీలకులు చెబుతున్నారు.



అలంపూర్ సీఎం సభకు భారీగా హాజరైన జనం